# సమాధులు తవ్వి.. బొక్కలను జుర్రుకొని..

- పశ్చిమాఫ్రికాలోని సియెర్రా లియోన్‌లో 'జాంబీ డ్రగ్'కు బానిసై విపరీత చర్యలు
- దేశంలో ఎమర్జెన్సీ విధించిన అధ్యక్షుడు
- శ్మశానాలను కాపాడేందుకు పోలీసులతో భద్రతా ఏర్పాట్లు



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్(నమస్తే తెలంగాణ): కొరియా సినిమాల్లో జాంబీలను చూసే ఉంటారుగా. ఆ జాంబీలు నిజజీవితంలో ఎదురైతే ఎలా? పశ్చిమాసియా దేశం సియెర్రా లియోన్‌లో దాదాపు ఇలాంటి పరిస్థితులే దాపురించాయి. 'జాంబీ డ్రగ్'కు బానిసైన కొందరు యువకులు, పైసల కోసం మరికొందరు డీలర్లు.. ఇలా అందరూ కలిసి దేశంలోని అన్ని శ్మశానాలపై పడ్డారు. సమాధులను తవ్వి ఎముకలను పట్టుకుపోతున్నారు. పరిస్థితులు అదుపుతప్పడంతో దేశాధ్యక్షుడు జూలియస్ మాడా బయో దేశమంతటా అత్యయిక స్థితిని విధించారు.

### ముప్పు ముంచుకొచ్చింది ఇలా..

జాతుల వైరం, అంతర్గత కుమ్ములాటలు, ఆర్థిక-ఆహార సంక్షోభంతో అల్లాడే సియెర్రా లియోన్‌లో నిరుద్యోగమూ ఎక్కువే. యువకులు చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారు. ఇదే సమయంలో 2018లో 'కుష్' అనే జాంబీ డ్రగ్ అక్రమార్కుల ద్వారా దేశంలోకి ప్రవేశించింది. ప్రమాదాన్ని గుర్తించిన ప్రభుత్వం.. దీనిపై నిషేధం విధించింది. అయితే, చాపకింద నీరులా విస్తరించిన ఈ డ్రగ్ మహమ్మారి ఇప్పుడు ఆ యువతనే బలిగొనే స్థాయికి చేరింది.

### పిచ్చిపట్టిన వారిలా..

'కుష్' తయారీలో మనిషి ఎముకల పొడిని వాడుతారు. కొందరు అత్యాశపరులైన డీలర్లు దొంగలకు డబ్బులిచ్చి సమాధులను తవ్వించి, ఎముకలను తయారీదారులకు అందజేస్తున్నారు. డ్రగ్‌ను స్వతహాగా తయారు చేసుకోవడానికి కొందరు యువకులు జట్టుగా ఏర్పడి గంజాయిని ఇండ్లల్లోనే పెంచుకొని, శ్మశానాలపై పడుతున్న దృశ్యాలు నిత్యకృత్యంగా మారినట్టు స్థానిక మీడియా పేర్కొంది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా వందలాది సమాధులను తవ్వినట్లు సమాచారం. దీంతో ప్రభుత్వం శ్మశాన వాటికల వద్ద పోలీసులతో భద్రతను కట్టుదిట్టం చేసింది. డీ-అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని బయో తెలిపారు.

### ఏమిటీ జాంబీ డ్రగ్ 'కుష్'?

గంజాయి, టెంటానైల్, ట్రామడోల్ వంటి మత్తు పదార్థాలు, మనిషి ఎముకల మిశ్రమంతో తయారు చేసేదే 'కుష్'. దీన్ని కొద్దిగా తీసుకొన్నా.. కొన్ని గంటల వరకూ మత్తులో తూగేలా చేస్తూ మెదడుపై దుష్ప్రభావాన్ని కలుగజేస్తుంది. శరీరంలోని అవయవాలకు వాపు, అంతర్గత రక్తస్రావాలకు కారణమై ప్రాణాలను తీస్తుంది. 'కుష్' డ్రగ్ కారణంగా 18–25 ఏండ్ల వయసున్న యువతే ఎక్కువగా ప్రభావితం అవుతుండగా.. మరణాల సంఖ్య వందల్లో ఉన్నట్టు తెలుస్తున్నది.

# గజరాజులను భరించలేం.. బాబోయ్!

- 1.3 లక్షల ఏనుగులతో బోట్స్‌వానాకు తిప్పలు
- 'ట్రోఫీ హంటింగ్'కు ఓకే.. మండిపడ్డ జర్మనీ
- 20 వేల ఏనుగులను పంపిస్తామన్న బోట్స్‌వానా



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): ఏనుగుల సంతతి పెరుగుదలతో ఆఫ్రికా దేశం బోట్స్‌వానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. ఆహారం దొరక్క ఊళ్లమీద పడే మదగజాల సంఖ్య పెరిగిపోవడం సర్కారుకు కష్టంగా మారింది. ఏనుగుల గుంపు పంటలను నాశనం చేస్తున్నదని ప్రభుత్వానికి మొరపెట్టుకొంటున్న వారి సంఖ్య అంతకంతకూ పెరిగిపోతున్నది. దీంతో 'ట్రోఫీ హంటింగ్'పై (ప్రభుత్వానికి డబ్బు చెల్లించి ప్రత్యేక అనుమతితో జంతువులను వేటాడటం) గతంలో విధించిన నిషేధాన్ని ప్రభుత్వం ఎత్తేసింది. తద్వారా ఏనుగుల సంఖ్యకు చెక్ పెట్టడంతో పాటు ప్రభుత్వ ఖజానాకు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని భావించింది. అయితే, బోట్స్‌వానా నిర్ణయాన్ని జర్మనీ వ్యతిరేకించింది. దీంతో తమ నిర్ణయాన్ని వ్యతిరేకించిన జర్మనీకి 20 వేల ఏనుగులను బహుమతిగా పంపిస్తామని బోట్స్‌వానా స్వీట్‌వార్నింగ్ ఇచ్చింది. గతంలోనూ ఈ తరహా హెచ్చరికలనే బ్రిటన్‌కు కూడా చేసింది.

# ఈ ఏడాది మంచి వానలే!

## తెలంగాణలో సాధారణం కంటే అధిక వర్షాలు

## ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా



హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): దేశంలో ఈ ఏడాది రుతుపవన కాలం సమయంలో మంచి వానలు (సాధారణ వర్షపాతం) కురుస్తాయని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా వేసింది. సీజన్ రెండో అర్ధ భాగంలో అధిక వర్షాలు పడుతాయని పేర్కొన్నది. జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య నాలుగు నెలల కాలానికి దీర్ఘకాల సగటు(ఎల్‌పీఏ) 868.6 మిల్లీమీటర్లలో 102 శాతం వర్షపాతం(ఎర్రర్ మార్జిన్ 5%) నమోదు అవుతుందని చెప్పింది. దక్షిణ, పశ్చిమ, వాయువ్య ప్రాంతాల్లో సరిపడా మంచి వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈశాన్య భారతంలో రుతుపవన సీజన్ మొదటి సగంలో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఎల్‌పీఏలో 96–104 శాతం మధ్య వర్షాల పడితే సాధారణ వర్షపాతంగా పేర్కొంటారు.

### ఎల్‌నినో నుంచి లానినోకు..

బీహార్, జార్ఖండ్, ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు వర్షపాత లోటును ఎదుర్కొంటాయని స్కైమెట్ ఎండీ జితిన్ సింగ్ తెలిపారు. కేరళ, కర్ణాటక, తెలంగాణ, ఏపీ, గోవాలో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని చెప్పారు. ఎల్‌నినో నుంచి లానినాకు మారడం వల్ల సాధారణ వర్షాలు కురుస్తాయని చెప్పారు. ఎల్‌నినో కాకుండా ఐవోడీ వంటి ఇతర అంశాలు కూడా రుతుపవనాలను ప్రభావితం చేస్తాయని వెల్లడించారు. ఎల్‌నినో నుంచి లానినాకు వేగవంతమైన మార్పు సీజన్ ప్రారంభానికి అంతరాయం కలిగిస్తుందని అంచనా వేశారు.

### సానుకూలంగా 'నైరుతి'

ఈ ఏడాది ఎల్‌నినో పరిస్థితులు తగ్గిపోవడం, యురేషియాలో తగ్గిన మంచు కవచంతో నైరుతి రుతుపవనాలు సానుకూలంగా ఉంటాయని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ మృత్యుంజయ మహాపాత్ర ఇటీవల తెలిపారు. మనదేశంలో ఎల్‌నినో క్షీణిస్తుండటం శుభపరిణామంగా పేర్కొన్నారు. జూన్ నెల మొదలయ్యే సమయానికి ఎల్‌నినో తగ్గిపోయే అవకాశం ఉందన్నారు. అదే జరిగితే నైరుతి రుతుపవనాలు యాక్టివ్ అవుతాయన్నారు. రుతుపవనాల సీజన్ జూన్-సెప్టెంబర్ రెండో అర్ధభాగంలో మన దేశంలో లానినా పరిస్థితులు ఏర్పడొచ్చునని ఆయన తెలిపారు. దేశంలో రుతుపవనాలపై ఉత్తర హిమాలయాలు, యురేషియా భూభాగంపై ఉండే మంచు కవచం ప్రభావం చూపిస్తాయని మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. 'ఎల్‌నినో' ఎఫెక్ట్ కూడా ఎక్కువగానే ఉంటుందని చెప్పారు.

## ఎండల్లో 'మార్చి' కొత్త రికార్డు

న్యూఢిల్లీ: గతంలో ఎప్పుడూ లేనంత ఉష్ణోగ్రత ఈ ఏడాది మార్చి నెలలో నమోదైనట్టు యూరోపియన్ యూనియన్ వాతావరణ సంస్థకు చెందిన కోపర్నికస్ క్లైమెట్ చేంజ్ సర్వీస్(సీ3ఎస్) మంగళవారం వెల్లడించింది. ఎల్ నినో పరిస్థితులు, మనుషుల వల్ల కలిగిన వాతావరణ మార్పుల వల్ల మార్చిలో ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదైనట్టు తెలిపింది. 1850 – 1900 మధ్యకాలంలో సగటు మార్చి నెల ఉష్ణోగ్రతల కంటే ఈ ఏడాది మార్చిలో సగటు ఉష్ణోగ్రత 1.68 డిగ్రీలు అధికంగా నమోదైనట్టు వెల్లడించింది. 1991 – 2020 మధ్యకాలంలో మార్చి నెల సగటు ఉష్ణోగ్రతల కంటే 0.73 డిగ్రీలు ఎక్కువ ఉష్ణోగ్రత ఈ మార్చిలో నమోదైనట్టు తెలిపింది. ఇంతకుముందు 2016 మార్చిలో అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా, ఈ మార్చిలో అంతకంటే సగటున 0.10 ఉష్ణోగ్రత ఎక్కువ నమోదైనట్టు పేర్కొన్నది. ఇక, ప్రపంచవ్యాప్తంగా గత 12 నెలల (ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024) ఉష్ణోగ్రతలు కూడా చరిత్రలోనే అత్యధికంగా నమోదైనట్టు ఈ సంస్థ వెల్లడించింది. 1850 – 1900 మధ్యకాలం కంటే 1.58 డిగ్రీలు, 1991 – 2020 మధ్యకాలం కంటే 0.70 డిగ్రీల సగటు అధిక ఉష్ణోగ్రత గత పన్నెండు నెలల్లో నమోదైనట్టు తెలిపింది.

## నెట్‌వర్క్ లేకపోయినా.. ఫోన్ కనిపెట్టేయొచ్చు!

### 'ఫైండ్ మై డివైజ్' అప్‌గ్రేడ్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): ఫోన్ పోగొట్టుకొన్నారా? వెతుకుదామంటే.. ఇంటర్నెట్ కనెక్టివిటీ లేదా? పైగా హ్యాండ్‌సెట్ ఆఫ్‌లో ఉందా? ఇకపై మరేం ఇబ్బందిలేదు. నెట్‌వర్క్ లేకపోయినా.. ఫోన్ ఆఫ్‌లో ఉన్నా.. పోగొట్టుకొన్న మొబైల్‌ను ఈజీగా కనిపెట్టడానికి గూగుల్ తన 'ఫైండ్ మై డివైజ్' ఫీచర్‌ను తాజాగా అప్‌గ్రేడ్ చేసింది. ఆండ్రాయిడ్ 9 లేదా అంతకంటే ఎక్కువ వెర్షన్ ఫోన్లలో సపోర్ట్ చేస్తున్న ఈ ఫీచర్ ప్రస్తుతం అమెరికా, కెనడాలో మాత్రమే అందుబాటులోకి వచ్చింది. త్వరలో మిగతా ప్రాంతాల్లోకి తీసుకురానున్నట్టు గూగుల్ ఒక ప్రకటనలో వెల్లడించింది.

## బస్ బోల్తా పడి 15 మంది మృతి

### ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం

ఛత్తీస్‌గఢ్ : ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఉద్యోగులను తీసుకుని వెళ్తున్న ఒక ప్రైవేట్ బస్ 40 అడుగుల లోతైన మట్టిగనిలోకి బోల్తా పడటంతో 15 మంది మరణించగా, 12 మందికి పైగా గాయపడ్డారు. ఈ ప్రమాదం దుర్గ్ జిల్లాలోని ఖాప్రీలో మంగళవారం రాత్రి 8.30 గంటలకు చోటు చేసుకుంది. ఒక ప్రైవేట్ డిస్టిలరీలో పనిచేస్తున్న ఉద్యోగులను డ్యూటీ ముగిసిన తర్వాత తీసుకుని వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది.

## రఫాను ఆక్రమిస్తాం

### అమెరికా హెచ్చరికలను లెక్కచేయని ఇజ్రాయెల్

జెరూసలెం : హమాస్‌పై యుద్ధంపై తగ్గేదే లేదంటూ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ తెగేసి చెప్పారు. దక్షిణ గాజానగరం రఫా సహా అన్ని చోట్ల హమాస్ బ్రిగేడ్లను పూర్తిగా తుడిచిపెట్టే వరకు తమనెవరూ ఆపలేరని స్పష్టం చేశారు. రఫాపై దాడులు చేస్తే ఏకాకిగా మిగిలే ప్రమాదముందని అమెరికా హెచ్చరికలు జారీ చేసిన క్రమంలో నెతన్యాహు మాట్లాడుతూ 'ఏ శక్తీ మమ్మల్ని ఆపలేదు. ఎన్నో శక్తు లు మా చర్యలను అడ్డుకోవడానికి ప్రయత్నించాయి. కానీ ప్రయోజనం లేదు. మా శత్రువు ఇటీవల చేసింది భవిష్యత్‌లో మళ్లీ చేయకుండా గట్టిగా బుద్ధి చెబుతాం' అని ఆయన పేర్కొన్నారు.




## చంద్రయాన్-3 బృందానికి ప్రతిష్టాత్మక పురస్కారం

కొలరాడో, ఏప్రిల్ 9: చంద్రయాన్-3 మిషన్‌ను సక్సెస్ చేసిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సైంటిస్టుల బృందం ప్రతిష్టాత్మక జాన్ ఎల్ జాక్ స్విగర్ట్ జూనియర్ పురస్కారాన్ని అందుకుంది. అమెరికాలో కొలరాడోకు చెందిన ఎన్జీవో సంస్థ 'స్పేస్ ఫౌండేషన్' ఏటా అందజేస్తున్న ఈ పురస్కారం అంతరిక్ష పరిశోధనలో అత్యంత ప్రముఖమైనదిగా భావిస్తారు. సోమవారం కొలరాడోలోని నిర్వహించిన 'స్పేస్ సింపోజియం' కార్యక్రమంలో ఈ అవార్డును చంద్రయాన్-3 బృందం తరఫున హూస్టన్‌లోని భారత కాన్సుల్ జనరల్ డీసీ మంజునాథ్ అందుకున్నారు. అమెరికా వ్యోమగామి జాన్ ఎల్ జాక్ స్విగర్ట్ జూనియర్ జ్ఞాపకార్థం స్పేస్ ఫౌండేషన్ ఈ అవార్డును ఏటా అందజేస్తున్నది.

## వంధ్యత్వమున్న పురుషుల కుటుంబాలకు క్యాన్సర్ ముప్పు!

న్యూఢిల్లీ: వంధ్యత్వ (సంతానలేమి) సమస్య ఉన్న పురుషుల కుటుంబాలకు క్యాన్సర్ ముప్పు ఎక్కువగా ఉంటున్నట్టుగా అమెరికాకు చెందిన పరిశోధకులు గుర్తించారు. ఉటా యూనివర్సిటీలోని హంట్స్‌మన్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన పరిశోధకులు.. ఉటా పాపులేషన్ డాటాబేస్‌కు చెందిన ప్రజారోగ్య, జన్యు సమాచారాన్ని విశ్లేషించి ఈ విషయాన్ని తేల్చారు. పరిశోధనలో భాగంగా వంధ్యత్వం ఉన్న పురుషుల తల్లిదండ్రులు, తోబుట్టువులు, దగ్గరి బంధువులను సైతం పరీక్షించారు. వీరి కుటుంబాలకు పెద్ద ప్రేగు, వృషణాల, ఎముక సహా ఇతర క్యాన్సర్ ముప్పు ఎక్కువ ఉన్నట్టుగా పరిశోధకులు తేల్చారు. కాగా, వంధ్యత్వ సమస్య ఉన్న పురుషుల కుటుంబాలకు క్యాన్సర్ ముప్పు ఎక్కువ ఉన్నట్టు గుర్తించినప్పటికీ, ఇందుకు కారణాలను పసిగట్టేందుకు మరింత అధ్యయనం చేయాల్సి ఉందని పేర్కొన్నారు.

## దక్షిణాసియా పర్సన్ ఆఫ్ ది ఇయర్‌గా అవంతిక



ముంబై, ఏప్రిల్ 9: తెలుగమ్మాయి, ఇండియన్ అమెరికన్ నటి అవంతిక వందనపునకు అరుదైన గుర్తింపు లభించింది. ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ యూనివర్సిటీ ఆమెను దక్షిణాసియా 'పర్సన్ ఆఫ్ ది ఇయర్'గా ప్రకటించింది. 'మీన్ గర్ల్స్' సినిమాలో తన నటనతో అలరించిన ఆమె నట ప్రస్థానం ఇప్పుడే మొదలైందని కితాబిచ్చింది. తన అద్భుత నటనా ప్రదర్శనతో అంతర్జాతీయ, భారతీయ వినోద పరిశ్రమలపై ఆమె చెప్పుకోదగ్గ ప్రభావాన్ని చూపిందని కొనియాడింది. తనకు హార్వర్డ్ పురస్కారం లభించడంపై అవంతిక హర్షం వ్యక్తం చేశారు. 'ప్రతిష్ఠాత్మక సంస్థ నుంచి ఈ గౌరవాన్ని పొందడం నిజంగా నమ్మశక్యం కాని ప్రేరణ కలిగిస్తున్నది. ఇది నా ప్రయత్నాన్ని గుర్తించడమే కాదు, దేశాల హద్దులు దాటిన కథనాల ప్రాముఖ్యతను, ప్రపంచ మీడియాలో భారతదేశం పోషిస్తున్న కీలక పాత్రను గుర్తిస్తున్నది' అని ఆమె తెలిపారు. ఇండియన్ ఓటీటీ 'బిగ్ గర్ల్స్ డోంట్ క్రై' అవంతికకు మంచి గుర్తింపు తెచ్చింది. ప్రస్తుతం ఆమె పలు హాలీవుడ్ ప్రాజెక్టుల్లో నటిస్తున్నారు. బాల నటిగా పలు తెలుగు సినిమాల్లో నటించారు.

## నోబెల్ గ్రహీత పీటర్ హిగ్స్ కన్నుమూత

లండన్, ఏప్రిల్ 9: బ్రిటన్‌కు చెందిన ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ అవార్డు గ్రహీత పీటర్ హిగ్స్(94) సోమవారం కన్నుమూశారు. స్వల్ప అనారోగ్యానికి గురైన ఆయన తన ఇంట్లో తుదిశ్వాస విడిచారని ఎడిన్‌బర్గ్ యూనివర్సిటీ ప్రకటించింది. ఈ యూనివర్సిటీలో పీటర్ హిగ్స్ దాదాపు 50 ఏండ్లు ప్రొఫెసర్‌గా పని చేశారు. 1964లో ఆయన కనుగొన్న ద్రవ్యరాశి కణ సిద్ధాంతానికి గానూ 2013లో నోబెల్ అవార్డు దక్కింది. బెల్జియంకు చెందిన మరో భౌతిక శాస్త్రవేత్త ఫ్రాన్కోయిస్ ఎంగ్లర్ట్‌తో కలిసి సంయుక్తంగా హిగ్స్ నోబెల్ అందుకున్నారు.

